# “తప్పంతానాదేనా?”

బుర్రా అప్పారావు

౧

స్వస్థలం మొదట పల్లెటూరైనా, మానాన్నకు చిన్నప్పటినుంచి పట్నవాసం కాపురమే. అక్కడనే చదువుకొన్నాడు. అతనికి నగరులో కిల్లాదారుపని. శేషగిరిరావుగారంటే మంచి పలుకుబడి.

మామోలుగానే ఆరోజున బడినిడిచిపెట్టిన అర్థ గంటకల్లా నే నింటికి చేరుకొన్నాను. నాతో మాపొరుగమ్మాయి కమలకూడా, యింటివద్ద చేయవలసిన హోము వ(Home work) ర్కంతా చేసుకోవటానికి మాయింటికి వచ్చింది. నాస్టడీస్ (Studies) గదిలో మే మిద్దరం కూచుని, ఉపక్రమించాం కార్యక్రమానికి.

“లక్ష్మీ, అల్లుడు పరీక్ష ఫస్టుక్లాసులో నెగ్గాడు సుమా!” అన్నాడు కచేరీనుండి వస్తో మానాన్న, యింకా తలపాగాఅయినా తీయకుండానే.

ఈమాటలు చెవినిపడగానే దిగ్గున తలపైకెత్తి మానాన్నకేసి చూచాను. మేం కూచున్న గది కెదురుగానే మానాన్నగది. ఒక కార్డుత్తరం అతనిచేతిలో క్రిందుమీదు లౌతో కనబడ్డది.

“ఏమిటేమి?” టంటో వంటయింటిలోనుండి ఊడిపడ్డది ససంభ్రమంగా మాఅమ్మ.

“అల్లుడు ఫస్టుక్లాసులో నెగ్గాడు. ఉత్తరం వచ్చింది.”

నా కానందం కలిగింది. కాని సంభ్రమపడుతో వున్నట్టు రూపించకూడదని నాపనిమీద నేనున్నట్టు తలదించాను. నాధ్యానంమాత్రం వారి సంభాషణపైనే వుంది.

“చూచారా? నేనంటే మీరు కాసింతన్నా లెక్కచేశారుకారు. నాకు మొదటినుంచీ నమ్మకమే, మీరుమాత్రం యేదో తుంటరికుర్రాడంటూవచ్చారుగాని” అన్నది మాఅమ్మ.

“నాకుమాత్రం తెలీనూ, మనవాళ్లను మనం పొగడుకోకూడదనిగాని?”

“జౌను మొగా ళ్లెప్పుడూ యిట్లాగే అంటారు. సరికాని, ఇప్పటికి బి. ఏ. అయిందికదా, యికపైనేం జేస్తాడో యేమన్నా వ్రాశాడా?”

“సీమవెళ్లి బారిష్టరుపరీక్షకి చదవటానికి కోరిక వున్నట్టు తెలియపర్చాడు. ఇందుకు మన సమ్మతికూడా వెంటనే తెలియపర్చాలిసిందని వ్రాశాడు.”

“సీమవెళ్లటమే!” అన్నది మాఅమ్మ అత్యాశ్చర్యంగా.

“ఏం?”

“సీమవెళ్లినవాళ్లు తిన్నగా తిరిగివస్తారా యింటికి? వస్తేమాత్రం సంఘంలోంచి బహిష్కరించేయరూ అంతానూ?”

“వాళ్లశ్రాద్ధం బహిష్కరిస్తారు. ఇదే ఆడవాళ్ల తెలివితక్కువ. మొన్న ఆచంటవారి అబ్బాయి ఐ. సి. యస్. పరీక్షకెళ్లి తిరిగివస్తే యేం బహిష్కరించారు? మహారాజులాగ సబుకలెక్టరీ చేస్తో హాయిగా వున్నాడు. మన్ని వాళ్లు బహిష్కరిస్తే వాళ్ల నందరినీ మనం బహిష్కరించేద్దాం. ఇట్లాంటి పట్టుదలలుపట్టి కూచుంటే కోరిక లెట్లా ఫలిస్తాయి? కార్యా లెట్లా సాగుతాయి? నా అభిప్రాయంమాత్రం అల్లుడు సీమ వెళ్లాలనే.”

“ఏమో నాకు తెలీదు. మీవుద్దేశాలు మీవి. అయితే మీయిష్టమే కానీండి. నాకేం? మీరూ మీకూతురున్నూ. ఇంతకూ యెంతకాలం పడుతుం దేమిటి తిరిగివచ్చేసరికి?”

“మూడునాలుగేళ్లు కావచ్చు.”

“ఓయబ్బో! నాలుగేళ్లే! ఇప్పటికే అమ్మాయికి కార్యంచేయలేదని అంటోవున్నా రమ్మలక్క

లంతాను. ఇంకా నాలుగేళ్లవరకూ యెదిగినపిల్లని యింటో పెట్టుకొంటే—మీకేం? మీరు మగాళ్లు— నలుగురూ నానోట్లో గడ్డెట్టరూ?"

"ఎవరో జ్ఞానశూన్యు లేమో అనుకొంటారని ముందుపురాబోయేవాళ్ల కభ్యంతరం కలగజేయటం నాకేమీ యిష్టం లేదు."

"ఔనౌను. మీ కెట్లా యిష్టమౌతుంది? పోనీ అట్లాగే కానీండి. అల్లుణ్ణి యేదొరసానిముండచేతుల్లోనో పెట్టేసి ఆనందించండి. నాకేం? ఇంతకూ దాన్నైనా అడుగుతారా? ఎదిగినపిల్ల. మీకూ నాకూకంటె దాని కెక్కువ సంబంధం వుంది యీ విషయంలో. ఆమాత్రం జ్ఞానం తెలియకపోదు."

"అట్లాగే. దాన్నే అడుగుతాలే—లలితా! ఇట్లారా అమ్మా ఓసారి"అని పిలచాడు నన్ను మానాన్న.

ఏమీ తెలియనట్టుగానే, మామోలుప్రకారం, ఒక్కసారిగ పరుగెత్తిపోయి, వాలుకుర్చీలో కూచున్న మానాన్న ఒడిలో కూలబడ్డాను. ఆతడూ నన్ను వెన్ను తట్టి, ముంగురులు సర్దుతో, నామొగంకేసి అదేపనిగా ప్రేమఉట్టిపడే చూపులు ప్రసరింపజేశాడు.

"అమ్మా, మీయాయన ఫష్టుక్లాసులో ప్యాసయాడు పరీక్ష. బారిష్టరుపరీక్షకోసం లండనువెళ్లే వుద్దేశం వున్నట్టు వ్రాశాడు. ఇదిగో వుత్తరం. నీయభిప్రాయ మేమిటో చెప్పు."

ఈమాట పూర్తిగా ముగియకమునుపే మాఅమ్మ "అమ్మాయీ, మీయాయన—బారిష్టరుకోసం కాదు—దొరసానమ్మల కౌగిళ్లకోసం పోతోవుంట. తెలిసిందా? సీమవెళ్లినవాళ్లు తిన్నగా తిరిగివస్తారన్నమాట కల్ల. ఎంతమందిని చూడలేదు మనం? ఒకవేళ వాళ్లబంధాలలోనుంచి రాగలిగినా నాలుగేళ్లకు తక్కువకాదు. అప్పటికి నీకెట్లా లేదన్నా పద్ధెనిమిదేళ్లు నిండుతాయి. ఆలోచించుకో. నీమొగుణ్ణి చేతులారా వదులుకోగలిగితే చూడు" అన్నది.

నేనుత్తరం చదువుతోనే యీమాటలన్నీ విన్నా.

"అమ్మాయీ! ఒక్కమాట చెప్పు. నీకింకా చదువుకోవాలనే అభిలాష వున్నదా?" అని అడిగాడు మానాన్న.

నాకు నిజంగా చదువుకోవటమంటే యిష్టమే. అందుచేత అంగీకారసూచకంగా తలకాయూపాను.

"ఔనా? ఇప్పుడు ఒకవేళ పోడే అనుకో మీయాయన; నీ చదువుకి నీళ్లు ధారవదులుకోవలసిందే కదా! ఏమి?"

నా కోవిధమైన అర్థం స్ఫురించి సిగ్గుచేత తలదించాను.

"ఆపైని, ఎవరో ఒకరిద్దరు పాడయితే, మీ అమ్మ చెప్పినట్టు, అందరూ ఆలాగే తయారౌతారన్న మాట వట్టి తెలివితక్కువ. తిరిగివచ్చి సుఖంగావున్న వాళ్లెందరిని మనం చూడటంలేదు? అందుచేత నీ భర్త యొక్క సౌఖ్యమే నువ్వు ప్రధానంగా గణించినట్టయితే, నీసమ్మతికూడా తెలియజేస్తో నేవ్రానే వుత్తరంతో జతపర్చి పంపు. మీయాయన తిరిగివచ్చేవరకు స్కూలుఫైనలువరకన్నా నీ చదువు సాంతమౌతుంది." అన్నాడు.

నామనసులో అనేకాలోచనలు పరువెత్తాయి. భర్త పెద్దచదువు చదివి నలుగురిలో పేరుగడించుకోవటం నాకూ యిష్టమే. ఆపైని నాచదువుకూడా సాంతమౌతుంది. కాని మా అమ్మ చెప్పిన మాటలయొక్క కర్మ కంటికికట్టినట్టుగా కనబడి భయం కలిగింది. ఏమి సమాధానం చెప్పటానికీ తోచక మౌనముద్ర వహించాను. మానాన్న అది యావత్తూ గ్రహించి—

"లలితా, నాకేసి చూడు. మీయాయన పరకాంతల చేతులలో పడిపోతాడేమోనని భయపడుతో వున్నావా? అయ్యో వెఱ్ఱితల్లీ! నీసంగతి నీ కింకా తెలీదుగాని, నీవంటి దివ్యసుందరవిగ్రహాన్ని భార్యగా కలిగి యేమూర్ఖుడు పరకాంతలకోసం పలవరిస్తాడు? నువ్వాభయ మేమీ పడకు" అని నామొగంకేసి తదేకదృష్టితో చూస్తో ముద్దెట్టుకొన్నాడు. "ఆపైని నువ్విప్పుడు కాసింత స్వార్థపరత్వం వహించావా అంటే

మీ భావిజీవితానికపకారం చేసుకొన్న దానివి కాగలవు. కాబట్టి ఆలోచించి చెప్పు" అన్నాడు.

ఆమాటల్లోనూ కొంత యథార్థ మున్నట్టు స్ఫురించి "అంతపనికాగలదా" అనుకొన్నా మనసులో.

మళ్లా అడిగాడు మా నాన్న. అప్రయత్నంగా "సరే" అన్నాను నేను. అతడు నన్ను అక్కున జేర్చి ముద్దెట్టుకొన్నాడు. మాఅమ్మ చ్రరున వెనుదిరిగి చర చరా నడిచింది వంటయింటికేసి.

ఆనాడే యీ క్రిందివిధంగా వ్రాసి మానాన్న జాబుతో జతపర్చి పంపేశాను:

"ప్రాణనాథుని పాదపద్మసన్నిధికి—

మహాభాగా,

మీపరీక్షాఫలితము తెలిసినప్పటి నాయానంద మునకు మేర లేదు. మీయింగ్లాండుప్రయాణ మునుగూర్చి మాయంగీకారమును తెలియపర్చ వలసినదని వ్రాసినారు. మనోహరా, త్వరలో మీపాదపరిచర్యాభాగ్యము లభింపగలదని సంత సించితిని. కాని మీపురోభివృద్ధికొరకు సహాయ పడుభాగ్యము నాయం దెంతవరకు గలదో గ్రహించి వేరేయాలోచనల నెడముచేసి, మీపయనమునకు నాసంపూర్ణాంగీకారము నొసగుచున్నాను.

కాని యొకవిన్నపము: కంటికి ప్రధానాకర్ష ణము చాయయేఅని పెద్ద లందురు. అట్టిలాభ మును ప్రకృతిసిద్ధముగ గలిగిన శ్వేతవాసు లతో—స్త్రీలతోగూడ—చనవుగా మెలగు నావశ్యకత మీకు గలుగవచ్చును. కావున నెట్టి సమయమునందును ఈ మీపాదసేవకురాలి రూప మును మీ హృదయఫలకమునుండి వేరుచేయకుం డురుగాకయని మిమ్ము గోరుచున్నాను. అట్టి భాగ్యమును నా కనుగ్రహింప నిత్యము నాభగ వంతుని ప్రార్థించుచు, మీతిరుగురాక కెదురు చూచుచు, దినములు లెక్కిడుకొనుచుందును.

ఇట్లు

మీ పాదదాసి,

లలిత."

## ౨

మూడుసంవత్సరాలు తిరిగాయి. చదువుమీది నిమగ్నత చాలవరకు ఆక్రమించటంచేత యీమూడేళ్లూ సులభంగానే జరిగిపోయాయి. నే నిప్పుడు స్కూలు ఫైనలుపరీక్షకు చదువుతోవున్నాను. మాయిద్దరి మ ధ్య నూ — అ న గా నేను, నాభర్త—నెల కొక్కటికి తక్కువకాకుండా ఉత్తరప్రత్యుత్తరాలు తీవ్రంగా నడిచాయి. ఈలేఖలు మాపవిత్రప్రణయాంకు రానికి దోహదంచేసి, నీరుపోసి, పెంచి పెద్దచేసినయి.

మాఅమ్మకు నాన్నకు నేనే తొలిసంతానం. నాతరవాతే మిగిలిన యిద్ద రప్పచెల్లెళ్లూ, తమ్ముడూను. నేనంటే వాళ్లకు తగనిముద్దు. ఒకటిరెండుసార్లు డబ్బుకు ఒడుదుడుకు కలిగినప్పుడు నాభర్త నాపేర వ్రాస్తే మానాయనకు చూపించాను. ఆతడూ యేమాత్ర మున్నా వెనుదీయక కావలసినడబ్బు వెంటనే పంపాడు.

నేనే కాకుండా మరినలుగురైదుగురు ఆడవాళ్లు చదువుతోవుండేవారు మాక్లాసులో. స్త్రీలకు ప్రత్యేక స్థలం. నాదృష్టికి సరాసరిని ఒక్కచదువే గురికావటం చేత క్లాసులో మంచి బ్రిల్లియంటుస్టూడెంట్ల (Brill-i.nt Students)లో లెక్కపెట్టబడేదాన్ని. విశ్వనాథం మొగాళ్లలోను, నే నాడవాళ్లలోను ఫస్టు. ఒకప్పు డాతడు, మరొకప్పుడు నేను ఫస్టుగా నిలబడేవాళ్లం క్లాసులో. ప్రతిరోజూ లేడీస్టూడెంట్సు (Lady stude-nts) లో యెవరో ఒకరిద్దరు స్కూలుకుపోయేముందు మాయింటికి వచ్చేవారు. వాళ్లతో కలిసిపోయేదాన్ని. వచ్చినప్పుడుకూడా అఘమం కమలన్నా నాతో వుండేది. మేము స్కూలుకు వస్తూపోతోవుండేటప్పుడు దోవలో తరుచు "అదిగో! ఆపోతోవున్నమ్మాయే, చూడు, సౌందర్యం మూర్తీభవించినట్టుంది. ఈమెమొగుడే సీమ వెళ్లాడు." (ఆరోజుల్లో సీమవెళ్లటమంటే బహుఅక్క జంగా వుండేది.) అనేమాటలు స్త్రీపురుషుల నోటినుండి మాచెవిని పడేవి. తుంటరిపోకరుల మాట చెప్పనే అక్కరలేదనుకోండి.

ఈవిధంగా మార్చినెల వచ్చేసింది. పరీక్ష యిచ్చాను. నెగ్గగలనని నాకు మొదటినుండి ధైర్యమే. అయినప్పటికినీ జూనునెల కడపట పరీక్షాఫలితాలను ప్రచురపరచగా, ఫస్టుక్లాసులిస్టులో నాపేరు కనపడినప్పుడు పట్టరాని ఆనందం కలిగింది నాకు. ఈవార్తావిశేషం నా భర్తగారి కెంతవేగం అందచేయుదునా అనిపించింది. ఇది వరకే ఆయన వ్రాసిన ఓజాబులో ఆసంవత్సరం సెప్టెంబరు నెలలో తిరిగి యిండియాకు వచ్చేస్తోవున్నట్టు తెలియపర్చబడింది. సమయం వుందికదా అని ఫలితాలు తెలిసిననాడే ఓలేఖ వ్రాసి పడేయించేశాను పోస్టులో. అందులో, ఆయనతిరుపదల కత్యంతం యెదురుచూస్తోవున్నట్టుగాను, యింకేవేవో విషయాలతోను ప్రణయగర్భిత వాక్యాలు యిమిడ్చేశాను.

ఆగస్టునెల యావత్తూ జవాబుకోసం యెదురుచూచాను. రాలేదు. పోనీ, సెప్టెంబరులో యెట్లాగా వచ్చేస్తోవున్నారుకదా అనుకొన్నాను. సెప్టెంబరు నెల ప్రవేశించింది. ఒకటవ తేదీ, రెండవ తేదీ, మూడు, నాలుగు, ఐదు......పది......ఇరవయి......ముప్పయి; నెలంతా గడిచింది.


ఏరైలుబండీ నిరీక్షించకుండాపోలేదు. ఏనాడూ మనుష్యులు స్టేషనుకెళ్లటం మానలేదు. ఏటపాకూడా అత్యాతురతతో చూడబడకుండా వుండలేదు. వృథా. జాబూలేదు, మనిషీరాలేదు. ఇంకా నిరీక్షించాను. క్యాలండరుకాగితాలుతిరగబడ్డాయి. అక్టోబరు,...నవంబరు,...డిశంబరు. గుండెలో దిగులుపుట్టింది. ప్రతిదినమూనిరీక్షించటమే. ప్రతిదినమూ ఆశావిచ్ఛేదనమే. ఈయాశచేత యీమధ్య లేఖన్నా వ్రాయలేదు. మాఅత్తవారింటికి వ్రాసికనుక్కొంటే అక్కడాయిదేఅవస్థగావున్నట్టుజవాబు. ఎట్టకేలకు గత్యంతరం లేక వ్రాశానొకజాబు డిశంబరులో. కాని మెయిలునిరీక్షించటం మానలేదు. జనవరి,...ఫిబ్రవరి,...జవాబులేదు. మళ్లా వ్రాశాను. మేనెలవరకు వృథాగా యెదురుచూచాను, జాబన్నా వస్తుందేమోనని. ఏమీ తోచక యేదో వున్నట్టు సదా క్యాలెండరుకేసి చూడటం; అప్పటప్పటా కన్నీరు కార్చటం.

మేనెల పదిహేనవతేదీ వచ్చింది. సాయంకాలము అయిదుగంటలయింది. మానాన్నింకా కచేరీనుండి యింటికి రాలేదు. టపావచ్చింది. యథాప్రకారం ఆతురతతో నేనే అందుకొన్నా. లండనుముద్రతో ఓకవరు. అది చూచి అంత ఆనందం యిముడ్చుకోలేక నాకళ్లు బాష్పాలద్వారా వెడలగ్రక్కాయి. ఆకవరుచ్చుకొని ఒక్కసారిగ వంటయింటిలోవున్న మా అమ్మదగ్గరకు పోయి చూపించాను. "విప్పి చూచావా" అని అడిగింది మాఅమ్మ. "లే దింకా" అంటో కవరు చించి ఉత్తరం బయటికి తీశాను. ఇంగ్లీషు. నాభర్త వద్దనుండేకాని స్వహస్తలిఖితం కాదు.

"ప్రియా!

ఇంతకాలమునకైనను జాబొకటి వ్రాయజాలిన స్థితి కలిగినందులకు మిక్కిలి సంతసించుచున్నాను. నే నిదివరలో క్రిందటి సెప్టెంబరుమాసమునకు తిరిగి వచ్చివేసెదనని వ్రాసియుంటిని. కాని యింతవరకును రాక, జాబునైనను వ్రాయజాలక, మిమ్మల నందరిని సంశయసముద్రమున ముంచవలసివచ్చినందులకు విచారించుచున్నాను. కాని నే నేమి చేయగలను? దైవ మన్యథా తలంచినాడు. నేను క్రిందటి ఆగస్టు నెలనుండియు దుర్భరవ్యాధిగ్రస్తుడనై యుంటిని. జాడ్యవివరములు తెలిపి మిమ్మ కలతపరచుట కిష్టము లేక మానినాను. ఇంతకాలమును ఆసుపత్రిలో నే యుంటిని నాస్నేహితు డొకడు నాకు చేదోడుగ నుండకపోయినచో ఈసరికి నే నీలోకమును వీడి యుండవలసినదనియే చెప్పవచ్చును. దైవానుగ్రహమున ప్రమాదకరమైన స్థితి దాటినదని డాక్టరు తెల్పుచున్నాడు. ఇప్పుడిప్పుడే లోకము నెరుగుచున్నాను. కాని యింక నొక వత్సరమువరకు సముద్రప్రయాణమునకు దగనని చెప్పుటచే నినుచూచు భాగ్యము నంతవరకును దూరముచేయవలసివచ్చినదని చాల విచారించుచున్నాను. ఇంతకును బ్రదికియున్న నేమైనను చేయవచ్చును.

కాని యొక రహస్యము. నేను ఇన్ని నాళ్లును నాయన్న వస్త్రాదులకుగూడ నాస్నేహితుని కరుణా కటాక్షముపై నాధారపడియుంటిని. నా కెంత మాత్రము నది యిష్టము లేదు. కాని విధి లేకవచ్చినది. ఈవేళనే మాతండ్రిగారికి డబ్బు పంపవలసినదని జాబు వ్రాసినాను. అచ్చటి పరిస్థితు లెట్లున్నవో, యెంతవరకు పంపగలరో తెలియదు. అంతవరకు నే నీస్థితి నోర్వజాలను. కావున నేను నిన్ను కోరున దేమన నీవు మీనాయనగారితో జెప్పి—ఇదివరకే వారు నా కొనర్చిన మహోపకారమునకు వారికి కృతజ్ఞుడను—యెట్లయిననొక వెయ్యిరూపాయాలకు దక్కు వకాకుండ పంపించి నన్నీవిషమపరిస్థితుల నుంచి కాపాడగల్గినచో నీవు నాభాగ్యదేవత వను కొందును.



"...అని నన్ను దగ్గరకు తీసుకొన్నాడు."

అన్నట్టుమరచితిని. చదువు పూర్తియై పట్టాసంపాదించినాను. ఈసంగతి మీవారితో జెప్పవలెను.

సర్వదా నీరూపమును మనోనేత్రములయెదుట నుంచుకొని, నీదర్శన భాగ్యమున కత్యంతమునెదురుచూచు

నీప్రేమాభిలాషి,

కె. లక్ష్మణరావు."

ఓవంక ఆనందం, ఓవంక విచారం కలిసి బాష్పధారారూపంగా బైటకు వచ్చాయి నాకు.

"ఏడవకునాతల్లీ,! యేడవకు."

అంటో మాఅమ్మ తన పైటచెరగుతో నాకళ్ల నద్దుతోనే తానూ కన్నీరుకార్చింది. సంతోషసమయంలోనే యింతవరకు ఘనీభవించిన దుఃఖమంతా బైట కుబికి పోతుంది.

మా నాన్నకూడా వచ్చాడు. ఉత్తరం చూపించాను. చదువుకొన్నాడు. రెండునిమిషాలాలోచించి నాకేసి మొగందిప్పాడు. అనిమిష దృష్టితో తేరిచూచాడు. ఆ గభీరదృష్టిలో జాలి, విచారం, ప్రేమ మొదలైన పవిత్రభావాలన్నీ గోచరించాయి.

"నాతల్లీ, నీ దివ్యతేజంలో యేంవున్నదోగాని నా కీ ప్రపంచంలో నీకంటె ఆకర్షణీయమైన వస్తువు కనబడదు. నిన్నుజూస్తే నాహృదయం నీరైపోతోంది. నీసౌఖ్యంకోసం నాసర్వస్వం ధారపోద్దా మనిపిస్తుంది. అమ్మా, నే వెనుదీయను." అని నన్ను దగ్గరకు తీసుకొన్నాడు. నే నాతని భుజంతడిపేశాను కన్నీటితో.

ఆమర్నాడే మానాన్న డబ్బు పంపేశాడు.

మళ్లా ఓసంవత్సరం గడిచింది. ఇప్పటికి నాకు రమారమి యిరవయియేళ్లవయస్సు. ఈసంవత్సరంలోను, నావుత్తరాలకు ప్రత్యుత్తరాలు వస్తూనేఉండేవి, అంత తరుచుగా లేకపోయినప్పటికిన్ని. ఆఖరుత్తరంలో — అక్టోబరులో అందింది — డాక్టరు మరి ఆరునెలలవరకు ఓడప్రయాణం వద్దని చెప్పినాడనీ, తా నిదివరలో వ్రాసినప్రకారం నవంబరునెలలో రావటానికి వీలు లేకపోయినందుకు విచారిస్తోవున్నాననీ, మేనెలలో రాగలననీ వ్రాయబడింది. అదినాభర్త స్వహస్తలిఖితమే. నామొగం వికాసహీనమైపోయింది. కాని గత్యంతర మేముంది?

ఎదురుచూడగా చూడగా ౧౯౧౫-వ సంవత్సరం ఏప్రిలునెల వచ్చింది. ఓరోజున టపావచ్చింది. అందులో నాభర్తవద్దనుండి ఓజాబు. తనకు స్వస్థత చాలవరకు చేకూరినదనీ, కాని జర్మనుయుద్ధం అతి భయంకరంగా జరుగుతోవున్నందున ప్రయాణస్థుల స్థితి కడుప్రమాదకరంగా వున్నదనీ, యిట్టి సందర్భంలో బయలుదేరిరావటం అత్యంత సాహసమనిన్నీ వ్రాయబడింది ఆ జాబులో. రామరామా! నాకిదేమిగతి? దైవాన్ని దిట్టాను. ఏడ్చాను. ఏమిలాభం? మా నాన్న మనసుచివుక్కుమన్నది. అతనూ నాతోకూడా విచారించాడు. ఎవరుమాత్రం యేం జేయగలరు, దైవ యోగానికి తలకాయొగ్గటంవప్ప?

సంవత్సరాలు తిరగబడ్డయి. పందొమ్మిది... యిరవయి... యిరవైవొకటి... నాకిరవైనాలుగవ యేడిప్పుడు. ఈలోగా జాబులు రాకపోలేదు. కాని చాలఅరుదుగా వచ్చేవి. జర్మనుయుద్ధం ముగిసింది. చాలవర కరికట్టబడిన ప్రయాణికుల రాకపోకలు కడు రభసంగా సాగటం మొదలెట్టాయి. ఇప్పటికారు నెలలయింది నాభర్తవద్దనుండి ఆఖరుత్తరంవచ్చి. నేను మరల మరలా వ్రాశాను. జవాబు లేదు. ౧౯౨౧-వ సంవత్సరం చివర ఓజాబు వచ్చింది. దాని తెలుగుతర్జుమా యీక్రిందపొందుపరిచాను:

"ప్రియా,

నే నతిదీనావస్థ నున్నాను. అప్పులపాలైతిని. ఇండియాకు తిరిగి వచ్చివేయుదమన్న, యీయప్పులవారు నన్ను వదలకున్నారు. మాతండ్రికి వ్రాయగా అతనియశక్తి నెరుకపరచుచు రూ. ౫౦౦/- పంపినాడు. ఇంకను బంపుటకు చాలకాలమగునని వ్రాసినాడు. రూ. ౨౦౦౦కు తక్కువకాకుండ చెల్లించవలసియున్నది. నాకేమియును తోచకున్నది. నిను జూచు నపేక్షచే కనులు కాయలుకాచినవి. విధిలేక మరియొకసారి మీతండ్రిగారి కరుణపై నాధారపడవలసినయోగము తటస్థించినందులకు సిగ్గుచే చచ్చిపోవుచున్నాను. ఎట్లైనను మరి రూ. ౧౫౦౦ పంపించి నీయీదాసుని విముక్తుని గావించుకొందువుగాకయని కోరుచున్నాను.

ఇట్లు

నీ ప్రణయదాసుడు, క. లక్ష్మణరావు"

మానాన్నతో పోరి డబ్బు పంపించా నామరునాడే. వెంటనే వెళ్లిపోరావాలిసిందని ఓజాబుకూడా వ్రాశాను.

మరో ఆరునెలలు. ఓడకర్చులకు డబ్బులేదనీ, ఎంతశీఘ్రంగా పంపితే అంతవేగం వచ్చేస్తోవున్నాననీ మళ్లా ఓవుత్తరం వచ్చింది. మళ్లా మానాన్నతో పోరి రూ. ౬౦౦ పంపించాను. మరోసంవత్సరం గడిచింది. జాబూలేదు, మనిషీ రాలేదు. చాలా వుత్తరాలు వ్రాశాను. జబాబు లేదు. నాదుఃఖమంతా హృదయంలోనే ఘనీభవించేసింది, అలవాటుపడ్డకారణంచాత.

కార్యాలకూ కథలకూ తప్ప అనవసరవిహారాలకు గూడా వీథులలోనికి పోవటం నాకు మొదటినుంచీ అలవాటులేదు. అదిగాక యీపరిస్థితులలో అట్లా పోవటం అమర్యాదగాకూడా తోచింది. ఎప్పుడన్నా, యేకార్యానికన్నా వెళ్లినట్టయితే అక్కడి స్త్రీపురుషుల దృష్టులు నాపైనే వుండేవి. ఒక్కనాస్థితే కారణం కాదుసుమండీ! నాసౌందర్యంకూడా. అప్పుడప్పుడు స్త్రీపురుషులనోటినుండి "ఔరా! ఇంతటి సౌందర్య

నికి అడవిగాసిన వెన్నెలచందం గావలసినదేనా?" అనే మాటలు నాచెవిని పడేవి. నాకనులవెంబడి నీటిచుక్కలు జలజలా రాలేవి. తలదించుకొనేదాన్ని.

మరినాలుగునెలలు తిరిగాయి. నాభర్త దగ్గర నుండి జాబులేదని మరి మీకు చెప్పదలచుకోలేదు అది మార్చినెల; ౧౯౪౮-వ సంవత్సరం. ఆవేళ మాచిన్ని చెల్లాయి రుక్మిణిశోభనం. రావలసిన బంధువులల్లా వచ్చారు. ఇల్లు కలకలలాడుతోవుంది. నాచేతులతో అన్నీ అమర్చాను. కాని ఆదంపతు లనుభవింపబోయే సౌఖ్యం నేనోర్వలేకపోయాను. రాత్రి పదిగంట లయింది. ఇంకా నేను పడకచేరలేదు. మా అమ్మ మెల్లగా నావద్దకు వచ్చి "అమ్మాయీ!" అని పిలిచింది.

"ఆఁ!"

"తాతావారి సూర్యనారాయణ వచ్చాడు, చూచావా?"

"ఆఁ."

"అతడు మీనాన్న యిప్పుడు మాట్లాడుతో వుంటే వున్నాను. ఆశ డీమధ్య లండను వెళ్లాడట. అక్కడేమో నీభర్తను చూచాట్ట."

"ఆఁ. నిజంగానే? ఏంజేస్తోవుండగా? వస్తానని చెప్పారా యితడితో? ఇంకేం అన్నా రేమిటి? మాటాడవేం?" అని అతిసంభ్రమంతో ప్రశ్నమీద ప్రశ్న గుప్పేశాను.

"నాతల్లీ! నీ కావార్త అతి దుర్భరమైనది. అయినా చెప్ప కేంజేస్తాను?"

ఓపికబిగబట్టి "చెప్పు చెప్పు. దాచకు. దాచి ప్రయోజనం లేదు" అన్నా.

"నే ననుకొన్నంతా అయింది. ఓ యింగ్లీషు పిల్లను పెళ్లాడి పిల్లలను కంటోవున్నాడట నీభర్త" అంది.

"ఆఁ! నిజంగా? అతడు చూచాడా?"

"నాతల్లీ! నీతో అబద్ధమా? చూచాననే అన్నాడు."

అది భయమో, దుఃఖమో తెలిసిందికాదు. ఆసం దర్భంలో నాస్థితి వ్రాయడంకంటె ఊహించడమే సులభం. అప్రయత్నంగా "సరే" అని వెనకచూడ కుండా నాగదిలోనికి చరచరా పోయి, నా శూన్య పర్యంకంపై కూలబడ్డాను. నాహృదయావేదనచెప్ప లేను. నాకన్నీరు కాల్వలుగట్టి చెక్కలమీదుగా శయ్యపై బడి తడిపేసింది.

"ఓ లోకరక్షకా, కొందరిని కేవలం దుఃఖా ర్థమే సృష్టించావా? ఒకేయింటిలో ఓగదిలో భార్యా భర్త లిద్దరు సరససల్లాపాలతో ఆనందిస్తో వున్నారు. ఓగదిలో నేను భర్తృనిరాదరణకై పెల్లుగ రోదనం చేస్తోవున్నాను. వాళ్లుచేసిన పుణ్య మేమిటి? నాపాప మేమిటి?"

వెక్కివెక్కి యేడ్చాను. ఆసంతాప సముద్రం లో తెంతో భగవంతుడికి తెలియాలి. ఇంతకాలం వున్న ఆకొద్ది ఆశా పోయింది.

ఏడ్వగా, ఏడ్వగా కొంతసేపటికి దుఃఖం ఉపశ మిల్లింది. కన్నీరుకట్టింది. చిహ్నలుమాత్రం మొగముపై కనబడుతోవున్నయి. లేచి నుంచున్నాను. సాయం కాలం కట్టుకొన్న బనారసుచీరే యింకా శరీరాన్ని వుంది. ఎదురుగా నిలువుటద్దం. అందులో నా ప్రతి బింబాన్ని చూచాను. కొన్ని కొన్ని రూపాలకు దుఃఖం, సౌందర్యాన్ని యినుమడింపచేస్తుంది.

ఆరాజలక్షణలక్షితమైన విగ్రహం, ఆపచ్చని మిసిమిచాయ, ఆతీర్చి దిద్దిన అవయవాలు—నిదానంగా ఆసౌందర్యాన్ని తిలకించాను. నక్షత్రాల్లోని చందమా మని, మల్లెలలోని గులాబిఅని, సౌందర్యలక్ష్మిఅని పొగడ బడిన యీవిగ్రహంసౌందర్యం యెందుకోసం? నిగనిగ లాడుతోవున్న యీనవయౌవనం యెవ రనుభవించ టానికి? అడవిలోని గులాబిలాగ వాడిపోవాలిసిందేనా? కాదుకాదు—ముం దేదో వుంది—ఏంవుంది? ఎటు చూచినా కారుచీకటి—అంధకారమయమైన భావి జీవితం. మళ్లా దుఃఖం పొంగిపొరలింది. మరి ఆగలేక

పోయాను. అట్లాగే మళ్లీ శయ్యపై బడ్డాను. ప్రక్కంతా తడిపేశాను కన్నీటితో.

ఈయేడుపంతా మా కెందు కంటారా? అదికాదు నావుద్దేశం యిది వ్రాయటంలో. నాయట్టి యభాగినులు—పరకాంతాలోలురైన భర్తలచే విడువబడి దుఃఖిస్తో వున్నవారు—యెందరో వున్నారు. వాళ్ల గతి యేమి? ఏడ్వవలసిందేనా జీవితకాలమంతానూ? ఏమంటారో, యిప్పటి సంఘసంస్కర్తల నడుగుతా నీమాట.

3

అంజాలికరంగా- నిజమన్నా తెలుస్తుందేమో నని, ఓ వుత్తరం వ్రాశా నామరునాడే. ఉద్రేకపూరిత మైన మనసు భావాలను లేఖమూలంగా వ్యక్తపర్చలేక పోయినా, కన్నీటిచేత తడపబడి చెదరిపోయిన ఆఅక్షరాల నడిగితే చెబుతాయి నామనో వేదన... నిష్ఫలం.

కాలక్రమేణా యెంతటి గంభీరభావోద్రేకాని కన్నా వసివాడటం స్వభావం. నాలలాటలిఖిత మనుకొన్నాను. నాబీరువాలోని పుస్తకాలే నాస్నేహితులు. కాని యేనిర్మలప్రణయప్రధానచరిత్ర చదివినా, యేపవిత్రదంపతుల ప్రణయానందాన్ని చూచినా, హృదయాన్ని బ్రద్దలుచేసుకొని ఒక్కసారిగ దుఃఖం బయట కుబికేది.

సీత, సావిత్రి మొదలైన పరమపతివ్రతాశిరోమణులతో సమంగా తిన్నగ తిండితినటం మానేశానని గాని, శుభ్రమైన బట్టకట్టటం యెరగనని గాని, తల దువ్వుకొనేదాన్ని కాదని గాని నేను చెప్పను. కాని చేతికి గాజులు, మెడలోని కోగొలుసుతప్ప మిగతా నానగలన్నీ మాత్రం పెట్టెచేరాయి.

సుందరమైన మార్చినెలలో ఓచక్కని వెన్నెల రాత్రి. ఉత్తరహిందూస్థానంనుంచీ మహారాణీపుట్టినింటివారు యెవరో పరివారంతోగూడ రావటంచేత కలకత్తానుండి కొరింథియాథియేటరువారిని రప్పించి "లాయిలామజ్నూ" అనేనాటకాన్ని ఆరోజున నగరులో ప్రదర్శింపిస్తోవున్నారు. సంస్థానోద్యోగు లందరికీ, ఆపైని పట్టణంలోని పలుకుబడిగల పెద్దమనుష్యులకీ ఆహ్వానాలు పంపబడ్డయి. మానాన్న యాజమాన్యం క్రిందనే జరుగుతోంది అంతాను. స్త్రీలకోసమని రెండుపల్లకీలు మాయింటిముందుకు వచ్చిఆగినయి. అప్పటి కింటిలో నేను, మాఅమ్మ—మే మిద్దరమే స్త్రీలం. మా చెల్లాయి లిద్దరూ అత్తవారింట వున్నారు. నేను పోవటాని కిష్టపడ లేదు మొదట. కాని మాఅమ్మ బలవంతం మీద యెట్టకేలకు సమ్మతించి బయలుదేరాను.

స్త్రీలకు బాల్కనీ (Balcony) వుంది. మిరుమిట్లుగొలిపే రకరకాల దుస్తులు, మేలిముసుగులూ కలిగిన వుత్తరహిందూస్థాన స్త్రీలతోనూ, పట్టణంలోని భాగ్యవంతుల స్త్రీలతోనూ నిండి అప్సరోలోకంలా వుందా బాల్కనీ.

మహరాజా, రాణీ అంతా వచ్చారు నాటకానికి. నాటకం సరిగా తొమ్మిదిన్నరగంటలకు ప్రారంభించారు. స్త్రీపాత్రలు స్త్రీలే ధరించారు. నా కిదే మొదటిసారి యీవిధంగా నాటకంచూడటం. లాయిలా కన్యపాత్రధారి చక్కని యువతి. నాటకం కట్టుగా జరుగుతోంది. మాటమాత్రం తెలీ దనుకోండి. ఉత్తరం నుండి వచ్చినవాళ్లుమాత్రం స్త్రీపురుషులంతా "వహ్వా" అంటో వున్నారు. ఆపుణ్యదంపతుల ప్రణయప్రారంభంలోనే నాకు కంట నీరుతిరిగి పైటచెరగుతో అద్దుకొన్నాను. కారణం నాకే తెలుసు.

"అమ్మా, ఏడుస్తోవున్నారేం ఆనందఘట్టంలో?" అనేమాటలు మెల్లగా నాకుడిచెవిని పడ్డయి.

ప్రక్కకు చూచాను. ఒక ఉత్తరహిందూస్థాన యువతి, పాతికముప్పయియేళ్లవయ స్సుంటుంది. మాట మాత్రం స్వచ్ఛమైన తెలుగు. ఈవిపర్యయ సంబంధం చూచి నా కాశ్చర్యం కలిగింది. ఈమె యెవరాఅన్నట్టు తేరిచూచాను. ఆమె నాఅవస్థ గ్రహించికాబోలు "మీ రాశ్చర్యపడుతోవున్నారు. ఔను నిజమే. నేను చాల కాలం లాహోరులో వున్నాను. నాభర్తగారికి అక్కడ పని. అక్కడి ఆచారాలు, కట్టుబాటులు మాకు చాల వరకు వచ్చిపోయినయి. కారణాంతరాలచేత నేను, నా

భర్త యీవూరు వచ్చి కొద్దిరోజులాయె, యిక్కడనే వున్నాం." అన్నది.

రొట్టెబలంచేత కాబోలు ఆమెది బలిష్ఠమైన శరీరం. కూచున్నప్పటికిన్నీ ఆజానులంబితమైన విగ్రహంలా తెలుస్తోవుంది. ఆనల్లని కనుబొమలు, ఆవిశాలమైన కళ్లు, తీర్చిదిద్దినట్టున్న ముక్కు, యెఱ్ఱని పెదవులు, ఆకర్షణీయమైన మెయిచాయ- అన్నీ ఓవిధమైన అందం కూరుస్తో, కొద్దిగ మృదుత్వలోపమైన శరీరమల్లే తోచినప్పటికీ, సౌందర్యవతిఅని చెప్పతగేటట్టు చేశాయి. చెప్పకేం ? ఆమెయందు మంచి భావమే కుదిరింది నాకు చూచీ చూడటంలోనే. క్రొత్తవాళ్లతో ప్రసంగం పెద్దచేయటం భావ్యంకాకపోయినప్పటికీ, ప్రస్తుతపు మర్యాదయెరిగిన మనిషిలా కనబడటంచేత బొత్తుగా త్రోసివేయటాని కిష్టంలేక "అట్లాగనా? సంతోషం. మీపరిచయం కలిగినందుకు చాల ఆనందిస్తోవున్నాను. మీబస యెక్కడో నే నడగవచ్చునా?"

"తప్పకుండా, మాబస క్రొత్తపేటలో. నిజంగా మీకేసి చూడటంతోనే, మీరు వేరువిధంగా భావించరని నమ్మతాను–మీసౌందర్యమే కారణంగా నాకోవిధమైన లక్ష్యం కుదిరింది. ఇంతలో మీరు కన్నీరు కార్చటం చూచి, నాకు జాలికలిగి మీతో మాటాడేవరకు తోచిందికాదు. మీరెవరో దయచేసి చెబుతారని నమ్మతాను" అని అడిగిం దామె.

నేను మానాన్నవుద్యోగం, అడ్రసు విశదపరిచాను.

"మీభర్తగారి విషయం అడగవచ్చునా?"

నామనసు కలవరపడ్డది. ఏమిసమాధానం చెప్పటానికీ తోచలేదు. ఒక్కనిట్టూర్పుమాత్రం పుచ్చానప్రయత్నంగా.

"మీకు శరీరంలో తమేదోబాధగా వున్నట్టున్నది. అన్న దామె.

ఏవిధంగానన్నా తప్పించుకొందామని "ఔను; కొద్దిగ. మనము తరవాత మాటాడుకొందాము. దయచేసి మరోవిధంగా భావించరనుకొంటాను" అని కొంచెం మొగంతిప్పాను.

"మీబాధ నాకు తెలుస్తోవుందిలేండి, అది శారీరకంగాదు. ఇంతకూ మిమ్మాల్టే యిబ్బందిపెట్టనిష్టడు. దానికి మరోసమయం చూస్తాలేండి" అన్నదామె చిన్ననవ్వుతో.

ఇదేమిరా పిలువనిపేరంటమల్లె యిట్లా వచ్చిందనుకొన్నా. పోనీ తప్పిందే చాలని వూరుకొన్నాను.

నాటకం త్వరత్వరగా జరిగిపోతోంది. కాని నాదృష్టి దానిమీద లేదు. నా ఆలోచనలలో నేను మునిగిపోయాను. అప్పుడప్పు డానూతనయువతికేసి చూచేదాన్ని. ఆమెకూడ అంతవరకు నాకేసి నిదానంగా చూచి, నేనుచూడగానే చిరునవ్వుతో మొగం తిప్పుకొనేది. ఆదృష్టులలో ఓవిధమైన చాంచల్యం కనుపించింది. అప్పుడప్పుడు నాచీరెగాని, ముంగురులుగాని సవరిస్తోవుండేది ప్రేమసూచకంగా.

నాటకం ముగిసింది. ఎవరియిళ్లకు వాళ్లు పోతోవున్నారు. మేంకూడా లేచాం. మాతో నా ప్రక్కయువతీ లేచి—

" మీరు పోతోఉన్నట్టున్నారు. దయచేసి నన్ను మరచిపోరని నమ్మతాను " అన్నది.

" ఎంతమాట ? "

"అన్నట్టడుగమరచాను ; మీపేరు ? "

" లలిత. మీపేరో ? "

" విశ్వభారతి. మీస్నేహం యింకా సంపాదించటానికి ప్రయత్నిస్తాను. ఇంకా కొంతకాలం మేమిక్కడ వుండటం తటస్థించవచ్చును లేండి. "

" నాకోరికకూడ అదే. "

ఇంతలో పల్లకీలు సిద్ధంగా వున్నట్టు కబురు వచ్చింది.

"మరి నేను సెలవుతీసుకొంటాను" అన్నాను.

"మంచిది. త్వరలో మీదర్శనం చేయడానికి ప్రయత్నిస్తాను." అంటూ నాఅరచేయి పట్టుకొని పెన వేసి అతి ఆప్యాయంగా నులిమిం దామె.

మేం కూచున్నాం. పల్లకీలు కదిలిపోయాయి.

౪

కామరాజుగారు, సంపన్నగృహస్థు కాకపోయినా, సాధారణస్థితిపరులని చెప్పవచ్చు. ఆయన మాకొక దూరపుబంధువు. మావెనుకవీథినే వారియిల్లు. కొన్ని కాలాంతరాలచేత మానాన్నకు, ఆయనకు మనస్పర్థలు కలిగి ఎనిమిదేళ్లాయె. మాయింటికి వారుగాని, వారింటికి మేంగాని రాకపోకలు లేవు. ఆయన కొకకొడుకూ ఓకూతురున్నూ. కూతురు తలచెడ్డది. కాని పాతకాలపు వితంతువుకాదు. కేశఖండన లేదు, చీరె కట్టుతుంది, అన్నీ వున్నాయి. కొడుకుపేరు విశ్వనాథం. ఇతడు నాక్లాసుసహాధ్యాయుడని యిదివరకే వ్రాశాను. అతనిదీ, నాదీ యించుమించుగా ఒకేయీడు. మేమిద్దరమూ స్కూలుఫైనలుపరీక్ష ఫస్టుక్లాసులో పాసయిన తర్వాత, నేను స్కూలుమానేశాను; అతడుమాత్రం జాగ్రత్తగా చదువుకొంటూ మంచిమార్కులతో బి. ఏ. పూర్తిచేశాడు కాలేజీలోనే. నేనుస్కూలువిడిచిపెట్టిన తర్వాత ఒకటి రెండుసార్లు, ఏకాన్తాల సందర్భంలోనో తప్ప నే నాతడిని తరుచుగా చూడలేదు. ఆపైని రెండుమూడేళ్లాయె, నేను వీథిగుమ్మమే దాటి యెరగకపోవటంచాత బొత్తిగా చూడలేదు. అతడు బి. ఏ. పాసయిన తరువాత ఓసారి చూచాను. చూడ ముచ్చటగావుండే బాలకుడు సుందరపురుషుడుగా మారాడు. కాని బాలికాబాలకులు యువతీయువకులుగా మారటంచాత దూరదూరంగా తొలగిపోవలసి వచ్చింది. అదే ఆఖరు నే నాతడిని చూడటం.

రమారమి రెండేళ్లయింది కామరాజుగారు పరమపదించారు. విశ్వనాథం అప్పటికి చెన్నపట్టణంలో బి. యల్. పరీక్షకు చదువుతోవున్నాడు. తల్లి చిన్నతనంలోనే చనిపోవటంచాత, తండ్రిమరణంతో తానే సర్వాధిపతీ అయినా డింటికి.

తండ్రి బతికివున్నప్పుడే యెన్నో సంబంధాలు వస్తే విశ్వనాథం నిరాకరించేశాడు. అసలు వివాహమే వద్దని అతనిపట్టుదల. ఆపైని చదువుతో చెన్నపట్టణంలోనే వుండటంచేత ఆతరువాతకూడా అవసరం లేకపోయింది. మొత్తంమీద వివాహంమాత్రం కాలేదాతనికి. న్యాయవాదిపరీక్ష ప్యాసయి, సంవత్సరమై మావూళ్లోనే వున్నాడు. ఇంకా ప్రాక్టీసుమాత్రం మొదలెట్టలేదు యెందుచేతనోగాని.

ఈసంవత్సరంలోనుకూడా రెండుమూడు సంబంధాలు వచ్చినా, అతడు నిరాకరించేశాడు. అతనికి సంరక్షణార్థం తన వితంతుసోదరిమాత్రమే వుంది.

౫

నాటకం అయిన మూడోనాటిరాత్రి రమారమి తొమ్మిదిగంటలు కావచ్చింది. అప్పటికి మాయింటో అందరి భోజనాలూ అయిపోయినయి. మా నాన్న ఆఫీసుగదిలో కూచుని యేవోకాగితాలు చూచుకొంటూ వున్నాడు. మా అమ్మ, తమ్ముడూ పక్కలుచేరారు. నేనూ నాపడకగదిలోకి పోయి మేనువాల్చాను. అప్రియమైన తలపులు తలలోనికి రావటంతోనే, యిది కాదని బీరువాలోని ఓయింగ్లీషుపుస్తకం దీశాను, యిట్లాగన్నా నిద్రవస్తుందేమోనని. పక్కమీద పండుకొనే చదవటం మొదలెట్టాను. ఒకటిరెండుపేజీలవరకు వెళ్లి, ఆతర్వాత క్రమంగా విశ్వభారతిమీదికి మళ్లింది బుద్ధి. నవనాగరికపద్ధతి నాడిన ఆమెమాటలు జ్ఞాపకం వచ్చాయి.

ఈఅభాగిని చరిత్రంలో యీమె కేమన్నా సంబంధం వున్నదా అని ప్రశ్నించుకొన్నాను నాలో నేనే. తరచితరచి చూడగా మంచిజ్ఞానవంతురాలైన యువతిలా తోచింది. కారణంమాత్రం దుర్భాగ్యంగాని, ఆమెతోడి సహవాసం అపేక్షించతగినదే అనిపించింది. ఎప్పుడన్నా మరలా కలుసుకొందామన్న వుద్దేశంకూడా కలిగింది.

ఇంతలో మెల్లగా వీథితలుపు తట్టినట్టయింది. విని, మామూలుప్రకారం యెవరన్నా తీస్తారని నేను నాతలపులలో పడ్డాను. మళ్లా తట్టినచప్పుడు. నేను లేవ బోయాను. ఇంతలో తలుపుతెరిచినచప్పుడు కావటంతోనే యథాస్థితికి దిగి పుస్తకంచూడటం మొదలెట్టాను.

“ఆగదే, రాండి” అన్న మాఅమ్మమాటలు వినబడ్డయి.

ఎవరాఅని నేను లేచి పక్కమీద కూచున్నాను. ఇంతలో మాఅమ్మ ముందు, ఆవెనక ఓఅవకుంఠనవతి ప్రవేశించారు నాగదిలోనికి. ఆగంభీరవిశాలవిగ్రహం విశ్వభారతిలా తోచి దిగ్గున మంచందిగాను. లోనికి ప్రవేశించినతరువాత మాఅమ్మ గదివిడిచిపోయింది. అప్పుడామె యింతవరకును మొగాన్ని గప్పిన ముసుగు తొలగించటం మొదలెట్టింది.

“తలవనితలంపుగా వచ్చారు. నే నిప్పుడే పుస్తకందీసి, మీమాటే అనుకొంటూవున్నాను. నాకు చాల ఆనందం కలిగింది. దయచేయండి” అంటూ నేను కుర్చీ దగ్గర కీడ్చాను.

ఆమె ఆసీనఅవుతూ “మీసన్నిధి వదలలేక” అన్నది. ఆసుందరాస్యం మందహాసచంద్రికలను వెదజల్లింది.

“మీదయ కలుగబట్టి, కాని యింతరాత్రివేళ రావడానికి కారణం ?”

“మాకు రాత్రులేగాని పగలు నడివీథిలోనికి పోవటం అలవాటులేదు. రాత్రులే మాకు బందెవిడుపు, అక్కడ. ఉత్తరహిందూస్థానంలో రాత్రివేళ ముసుగు స్త్రీలతో నిండివుంటయి వీథులన్నీను.

“అట్లాగనా ?” అని నే నని, ప్రసంగం ఆగకుండావుండటంకోసమని అక్కడి మనుష్యుల ఆచార వ్యవహారాలు, కట్టుబాటులు మొదలైనవిషయాలను గురించి అడిగాను. ఆమెకూడా విసుగుదలలేకుండా యేవేవో చెప్పింది. మధ్యమధ్య యింగ్లీషు మాటలు— పదాలే కాకుండా వాక్యాలుకూడ—దొర్లించేది ప్రసంగవశాన్ని. ఇంగ్లీషు చదువుకొన్నదేమోనని నే నడిగాను. తాను యింగ్లీషు నేర్చుకొన్నదనీ, తనభర్తకు మిలిటరీవుద్యోగం కావటంచాత యింగ్లీషువనితలతో తరుచు మెలగవలసివచ్చేదనీ, అందుచాత బాగా మాట్లాడటంకూడ నేర్చుకొన్నదనీ చెప్పింది.

ఎట్లా అబ్బిందోగాని ఆమెప్రసంగవిధానం అత్యద్భుతంగానూ, మనోహరంగానూ వుండేది. ఎంతసేపు మాటాడినా విందామనే వుండేది. ఈవిధంగా ఆ మాటాడిన కొద్దికాలంలో ఆమె నామనసును పూర్తిగా ఆకర్షించేసింది.

కొంతసే పైనతర్వాత నాచరిత్రనుగురించి తానడిగింది. మొదట నా కిష్టంలేకపోయినా, ఆమె బలవంతంమీద చెప్పటం మొదలెట్టాను నావిషాదచరిత్రంతాను. ఆమె జాగ్రత్తగా విన్నది. నాతోకూడ విచారించింది. మధ్యమధ్య నాకంటినుండి నీరు వచ్చినప్పుడు ఆమెకూడా కన్నీరుకార్చినట్టు నాకు తోచింది, మొగం ప్రక్కకు తిప్పేసినప్పటికిన్నీ.

ఇంతలో పదకొండుగంటలు వినబడ్డయి. ఆమె పోతానంటూ లేచింది.

“ మళ్లా మీదర్శన మెప్పుడో ! ” అన్నాను.

“ మీ యాజ్ఞానుసారమే ” అన్నది నవ్వుతో.

“ నేను మీయింటికి రానా రేపు ? ” అన్నాను మర్యాద ననుసరించి, పైకి పోవటం నిజంగా యిష్టం లేకపోయినప్పటికిన్నీ.

“ అక్కరలేదు. మీ కంతశ్రమ నే నివ్వను. నేనే మళ్లా వస్తాలెండి రేపురాత్రి ” అన్నది.

మాట్లాడుతూనే వీథిగుమ్మముదగ్గరికి వచ్చేశాం. వీథిలో ఓజట్కాబండీ వుంది. ఆమె బండియెక్కింది. నేను సెలవుతీసుకొని యింటిలోనికి పోయాను. ఆ రాత్రల్లా ఆమె నాకళ్లలోనే వుంది.

తన వాగ్దానంప్రకారం ఆమర్నాడు మళ్లా వచ్చింది. ఈవేళంతా సారస్వతాన్నిగురించి ముచ్చ

టించాం. షేక్సుపియరు (Shakespeare) మహాకవితాలూకు కొన్ని నాటకాలను పొగడుకొన్నాం. ఆమె కున్న ప్రపంచజ్ఞానాన్ని చూచి నా కత్యాశ్చర్యంకలిగింది. ఆమె కొన్నికొన్ని విషయాలను- నాకు తెలియని వాటిని-బోధపర్చింది. ఈవిధంగా కాలంగడిపి పదకొండు కొట్టేసరికి ఆమె బయలుదేరిపోయింది.

మళ్లా వచ్చిం దామర్నాడు......ఆమర్నాడూ......ఆమర్నాడూకూడ. ఈవిధంగా రోజూ రావటం మొదలెట్టింది. వచ్చి పదకొండుగంటలతర్వాత పోయేది సాధారణంగా. నా కామెసన్నిధిని వున్నప్పుడు, యింతవరకు దీర్ఘంగా వుండేకాలం అతిసులభంగా పోయేటట్టు కనుపించేది. ఎప్పుడు సాయంత్రంపదునా, యెప్పుడామె వచ్చునాఅని యెదురుచూచే దాన్ని. ఒకరిమొగం ఒకరు చూచుకొన్న వేళావిశేషమేమో గాని, అంత గట్టిసంబంధం యేర్పడ్డది మాయిద్దరికిన్నీ. ఆమెకూడా నన్ను విడిచివుండలే ననేది. నాప్రారబ్ధానికి విచారించేది. కాని నన్నుమాత్రం విచారంగా వుండనిచ్చేదికాదు. శరీరంవిషయంలో గాని, గృహాలంకారంవిషయంలోగాని నే నేమాత్రం అశ్రద్ధగా వున్నట్టు కనబడ్డా ఒప్పుకొనేదికాదు. శుభ్రమైన బట్ట కట్టకపోతే పోట్లాడి కట్టించేది.



"విశ్వభారతి నాకేసి నిదానంగా చూచింది."

నాసౌందర్యాన్ని తేరిపారచూచి కన్నీరునించేది. ఈవిధంగా అన్నివిధాలా అత్యంతఆప్తురాలిలాగ మెలిగేది. అంతకంతకు మే మిద్దరం, వృథామర్యాదలు విడిచిపెట్టి, నువ్వును వ్వనేస్థితికి వచ్చాం.

చదువులోనన్నా, జ్ఞానంలోనన్నా పెద్ద కావటంచాత ప్రతివిషయంలోనూ తాను పైచేయితీసుకొని నన్ను మాటాడనిచ్చేదికాదు. తా నేంజేయమంటే అది నేను చేయవలసివచ్చేదేకాని, నా కా అవకాశం తా



నిచ్చేదికాదు. అట్లాగని, నా కెప్పుడూ యీర్ష్యగాని మత్స రంగాని కలగనిచ్చేది కాదు సుమండీ!

కాని ఒక్కటిమాత్రం నా కామెలో కనబడ్డది. ఒకొక్కప్పు డామె, మాటాడుతో మాటాడుతో మానేసి, యేదోఆలోచిస్తోవుండేది. ఆ ఆలోచనలలో పెద్దనిట్టూర్పులు వినవచ్చేవి. కారణంమాత్రం చెప్పేది కాదు, యెంత నేనడిగినాకూడ. అడగగాఅడగగా మెల్లగ "సరే" అని ఒకనిట్టూర్పువుచ్చి మామూలురస్తాలోనికి వచ్చేది. నాకంతా చిత్రంగా వుండేది.

ఈవిధంగా మొత్తంమీద పదిరోజులు గడిచాయి. ఆవేళ ద్వాదశి. విశ్వభారతి మామూలుప్రకారం రమారమి తొమ్మిదిగంటలకు నిరీక్షించగా, నిరీక్షించగా వచ్చింది. ఆ రోజున ఆమె తన మామూలుచురుకుదనంలో వున్నట్టులేదు. ఏదో మాట్లాడిందిగాని, యిదివరకంత రుచికరంగా లేవామాటలు. తానేదో గంభీరంగా ఆలోచిస్తోవున్నట్టున్నూ, మానసికమైన వేదన అనుభవిస్తోవున్నట్టుగాను తోచింది. నేను గుచ్చిగుచ్చి అడిగాను, కారణం. అనేకవిధాల బ్రతిమాలాను. ఒక పెద్దనిట్టూర్పువుచ్చి, తటాలున తెలివి వచ్చినట్టు నాకేసిచూచి "ఔను నువ్వీవేళ మాసిన పాత కట్టావేం?" అన్నది.

"లేదే! మడతచీరే యిది."

"ఏమో నా కంటికి నచ్చలా యీరంగు. అసహ్యంగా వుంది."

"మరేది కట్టుకోమంటావు?" అన్నాను చిన్ననవ్వుతో.

"నువ్వావేళ చూపిన, లేతనీలిరంగుసిల్కు చీర" అన్నది మందహాసచంద్రికలు ప్రసరింపజేస్తో.

"అబ్బే! అదెందుకూ? అది సదావాడటానికి పనికిరాదే! అది కట్టుకొంటే శరీరం అంతా కనపడుతుంది. ఏపవిత్రకార్యంకోసం వృథాగా యింతకాలం నిరీక్షించానో, ఏది నా కీజన్మలో అందనిమ్రాని పండో దానికోసం కొన్న దాచీరె. ఇంతవరకు నే నెప్పుడూ కట్టలేదు." అన్నాను. బాష్పబిందువులు రాలాయి నాకళ్లనుండి.

"అదిగో! అప్పుడే? ఇదే నీతో చిక్కు. ఆ చీరకట్టుకొంటే నువ్వెట్లావుంటావో చూద్దామని సరదాకలిగి అన్నాను. నువ్విట్లాగౌతావని తెలిస్తే అడుగుతానా?" అంటో తనపైటచెరగుతో నాకళ్ల నద్దింది.

అప్పటికి పదకొండు కావచ్చింది. నాదుఃఖం ఆగింది. "పోనీ, నీకంతసరదాగా వుంటే నే వద్దనను. కట్టుకొంటాలే. కాని అలవాటులేక నా కాచీరె కట్టుకోవటానికి మొగమాటం వేస్తుంది."

"మొగమాటానికిక్కడ మొగాళ్లెవరూ లేరుగా?" అన్నది సాభిప్రాయంగా నవ్వుతో.

నేను పెట్టెతెరచి చీరెతీశాను. తీసి దాన్ని ధరించాను. ఎదురుగానే నిలువుటద్దంవుంది. దానిలో నాప్రతిబింబాన్ని చూచాను. నేనువృథావ్యక్తినని మీరనుకోకుండావుంటే చెబుతాను—నిత్యంచూస్తోవున్న రూపమైనా, ఆజిలుగువలువ కట్టటంతోనే "నీకీలోకంలో సౌఖ్యం లేదు; నాలోకంలోనికి వెళ్లిపోరా"మని భగవంతుడు నన్నో అప్సరసలామార్చేసేడా అనిపించింది. మళ్లాచూచుకొంటే నేనూ నాగదీ. విశ్వభారతి నాకేసి నిదానంగా

చూచింది. ఆదృష్టులలో ఆనందం, ప్రేమ, ఉద్రేకం, జాలి, ఆఖరికి విచారం అన్నీ వున్నాయి. ఆభావార్థం ఆమెకే తెలియాలి. చూచి చూచి తలకాయదించేసింది. ఒక పెద్దనిట్టూర్పు విడిచినట్టు వినిపించింది నాకు. ఏమి చెపుమాఅని మళ్లా ఆమెవద్దకు వెళ్లి మొగం పైకెత్తాను. అందులో విచారం కనుపించింది: జాలికలిగింది నాకు. మళ్లా అడిగాను కారణం చెప్పమని. చేతులలో తల పెట్టుకొన్న దామె.

"నాయం దామాత్రం నమ్మకం లేదూ? ఇద్దరం సోదరులలాగ మెలగుతోవున్నామే! ఆమాత్రం రహస్యం చెప్పరాదో నాతో! నీయిష్టమే నాయిష్టమని, నీసౌఖ్యమే నాసౌఖ్యమని భావించేఅంత చనవుగా వున్నామే! నీయిష్టప్రకారం యిదిగో చీరకట్టుకొన్నా చూడు. కాబట్టి చెప్పకతప్పదు. ఈవేళేమన్నాసరే నువ్వు చెప్పేవరకు నిన్నీగుమ్మం దాటనిచ్చేది లేదు." అన్నాను.

"ఆ! వద్దువద్దు. నే పోతాను." అని నడవ పోయింది గుమ్మంకేసి.

నే నామెచేయిపట్టుకొని లాగుతో "ఏమన్నా చెప్పినవరకు నిన్నీవేళ వదలను."

"లలితా, నాదుఃఖం నన్నే అనుభవించనీ. నీకు చెప్పి నీకుకూడా వ్యథకలిగించటం నాకిష్టం లేదు." అని చేయిలాక్కోబోయింది. నేను వదలలేదు.

"నాకు వ్యథకలగదు. కలిగినప్పటికీ, నీనిమిత్తమై యెంతటివ్యథకన్నా సహించి సహాయం చేయటానికి సిద్ధంగావున్నాను."

"వద్దువద్దు. నామాట విను. నన్ను పోనియ్యి."

"వీలు లేదు. ఎటువంటిసంగతికానీ; చెప్పితీరాలిసిందే."

"నన్ను చాలయిబ్బంది చేస్తోవున్నావు."

"లేదు."

"అయితే, ఒకవేళ నేచెబుతాననుకో నీనిర్బంధంచాత; రహస్యంగా వుంచుతావా?"

"ఆహా! తప్పకుండా. అంతేకాదు; చేతనైన సహాయంకూడా చేస్తాను."

"చేతిలో చేయివెయ్యి."

నే నలాచేశాను. ఆమె మెల్లగ వెళ్లి కుర్చీపై కూచున్నది. నేను యెదురుగావున్న పందిరమంచాని కానుకొని నుంచున్నాను. ఆమె తనచేతుల్లోతలపెట్టుకొన్నది మళ్లా. ఒకటిరెండునిమిషాలు నిశ్శబ్దం. నేను మళ్లాఅడిగాను.

"లలితా, —"

"చెప్పు. భయం లేదు. నావాగ్దానం తప్పను."

"లలితా!—లలితా!—నే ననేకవిధాల ఆలోచించాను. చాలకాలం నిరీక్షించాను. అణుచుకోవటానికెంతకాలమో ప్రయత్నించాను. మనస్ఫూర్తిగా ప్రయత్నించాను. ఏవిధంగాకూడా లాభం లేకపోయింది. ఆగలేకపోయాను. నీకు భావ్యంగా తోచకపోయినప్పటికీ, నాకు తీరకవచ్చింది. నే నేం చేయగలను? లలితా! నేను—విశ్వభారతినికాను—విశ్వనాథాన్ని."

"ఆః!!!" నాకు తల తిరిగింది. చైతన్యమే తప్పిపోయిందో, నిశ్చేష్టతే కలిగిందో తెలీదు. ఆనుకొన్నదాన్ని అట్లాగే మంచంమీద పడ్డాను. నాతల నాచేతుల్లో వుంది. ఏవోమాటలు వినిపిస్తున్నయి.

"................నీకోసమే యెటువంటి సంబంధాలనన్నా నిరాకరించాను. తొందరపడి నిన్ను పాడుచేతామని నాకెప్పుడూ లేదు. నీభర్త రాకకోసం నీలాగే నేనుకూడా వేచాను. నిరీక్షించాను. అతని ప్రస్తుతపుస్థితికూడా కనుక్కొన్నాను. అతడు రాడని తెలిసి యిక ఆగలేకపోయాను. మా తండ్రికీ, మీ తండ్రికీ వుండిన స్పర్ధలచేత మీయింటికన్నా రావటానికి వీలు లేకపోయింది. ఏదారీ తోచక నేనూ యేడ్చాను నిజంగా. ఆఖరుకు, గత్యంతరం లేక, కావలసినవిషయాలన్నీ మాసాలకొద్దీ అభ్యసించి యీ వేషం ధరించి నీసన్నిధిని పొందగలిగాను. నువ్వునుగ్ర

హించకపోతే నాకు నిజంగా చావేగతి. నీకోసం యెంతత్యాగం చేశానో నీ కిప్పుడు తెలుసును. నన్ను కటాక్షించు..............."

నాకు చైతన్యం కలిగి లేచి నుంచుని చూచాను. ఆ చక్కగా అమర్చబడిన విగ్రహం లేదు, ఆ మేలిముసుగు లేదు, ఆ అలంకారాలు లేవు, ఆచీరా లేదు, జాకెట్టూ లేదు. అవన్నీ కుర్చీమీద వున్నయి. పంచ, లాల్చీ, మామూలుస్లిప్పరు జోడూ, క్రాపూ గలిగిన నాటి సుందరపురుషుడు విశ్వనాథం నాపాదాలదగ్గర ప్రత్యక్షం. నాశరీరాన్ని ఆచీరే వున్నది. నా క్షేమీ తోచిందికాదు. హృదయం కలవరపడిపోయింది, చలించింది.

"విశ్వనాథం!—విశ్వనాథం— నిన్ను—నిన్నే మరి పిలవాలి?"

" 'విశ్వనాథం' అన్నావే; అదిచాలు. లేదా 'మనోహరా' అను. వేరనకు. నిన్ను వేడుకొంటాను."

"లేదు లేదు—అబ్బ—కాదు. విశ్వ—ఆహాఁ—కాదుకాదు—మనోహరా! నేను నీసొమ్ము." అని అప్రయత్నంగా చేయూత యిచ్చా నతనికి లేవటానికి.

మరుక్షణం—నానడుము రెండుచేతులలో బిగిసిపోయింది; నాహృదయం మరొకహృదయానికి హత్తుకుపోయింది; నా పెదవులకు వూపిరాడిందికాదు. నాకు మరి తెలివి లేదు.......................

౬

అయ్యయ్యో! జగదీశ్వరా! సర్వస్వమునకన్న నేది స్త్రీజాతి కత్యంతసమాదరణీయమో—ఎయ్యది హిందూసతీ గర్వకారణమో—ఒక్కసారి పోయిన నెయ్యది ప్రాణమిచ్చియైనను తిరిగి గడింపరానిదో—ఏప్రవిమలాదర్శమును నే నాకర్షణీయములగు ననేకావకాశములనుండి యింతవరకు కతిభద్రముగ గాపాడుకొంటినో—ఏపవిత్రనామము నుచ్చరించుటకైనను నే నిష్టపడనర్హానో—అట్టి—అట్టి నా మానమర్యాద—అయ్యయ్యో!—మాసిపోయినది.

ఆంధ్రమాతలారా, సతీమతల్లులారా! నన్ను తిట్టకండి. నాగతి బాగా తిలకించారు. నాబాధ కన్నారు. నాయేడుపు విన్నారు. నాతోకూడ యేడ్చారు. మరొక్కసారి మనసుంచి బాగా ఆలోచించండి. అప్పుడు మీరు నన్ను తిట్టటానికిబదులు కనికరిస్తారు. అందరూ సీతాసావిత్రులుకారే! అందరూ దమయంతులుకారే!—వారికన్నా కొన్నిఆశలు, ధైర్యాలు వుండేవి—నాస్థితిలో మీరున్నట్టు భావించండి. నాదుర్భర సంతాపాంధకారంలో మీ రుండటానికి ప్రయత్నించండి. ఎంతభయంకరంగా వుందో! ఎటు చూచినా అంధకారబంధురం. ఎటుచూచినా ఘోర జీమూతసమూహం. మీస్థితిలోనే నేనూ వుంటే నా కీబాధ లేదు. నేనూ మీలాంటిదాన్నే; పతివ్రతనే. ఎంతకాలం ఓర్చాను? ఎంతకాలం ఆశించి నిరీక్షించాను నాభర్తకోసం? ఆశించి ఆశించి నిరాశచెందిన పిమ్మట, ఒకానొకచిత్రసందర్భంలో, ఆకస్మికమహోద్రేకం కారణంగా, మనసుచలించి, బుద్ధిమాంద్యం వహించి, దారితప్పిపోతే తప్పంతా నాదేనా? భావిసౌఖ్యం నిరాశఅయితే బ్రతుకెవరికి కావాలి? అడగండొక బాలవితంతువుని. లేక నావంటిదురదృష్టవతులైన స్త్రీలెందరో వున్నారీవిశాలభారతదేశంలో; వాళ్ల నడగండి. వాళ్లందరిగతి యేమికావాలి? మ్రగ్గిమ్రగ్గి చావవలసిందేనా? ఓసంఘ సంస్కర్తలారా, మీ రేమార్గం చూపిస్తారు మాకు?

రాత్రి— లేకవుదయం— రమారమి మూడు గంటలకు విశ్వనాథం మాయిల్లువిడిచిపెట్టాడు. నాకు చాలసేపటివరకు నిద్దరాలేదు. లేచేసరికి చాల ఆలస్యమైంది, బడలికకారణంగా. తొమ్మిది గంట లప్పుడే కొట్టారు.

నే నింతకాలం కడుజాగ్రత్తగా కాపాడుకొన్న మానధనం పోయింది. ఇప్పు డేదో ఒకటి కావాలి. విశ్వనాథం నే నేదంటే అది చేస్తానని వాగ్దానం యిచ్చాడు. రాత్రే ఆలోచించాం అంతాను. త్వరగా కాలకృత్యాలు నిర్వర్తించుకొని, మానాన్న పడకగదిలో

వుంటే వెళ్లా నతనివద్దకి. నిజంగా నే నా ముగం చూడ లేకపోయాను. కాని మొండిధైర్యం తెచ్చుకొన్నాను.

"నాన్నగారూ, మీతో ఒకముఖ్యవిషయాన్ని గూర్చి మాటాడాలి."

"ఏమమ్మా! ఏమి? రా కూచో."

"ఈవేళ మిమ్మిలాగున సిగ్గులేక అడుగుతో వున్నానని అనుకోకండి. విధిలేకవచ్చింది. నా ప్రస్తుత దీనావస్థ చూచారా?"

"నాతల్లీ! చూచాను. అందుకు నాహృదయం చూడు, యెంతదుఃఖిస్తోవుందో."

"నాకు తెలుసును. నాభర్త ఇక తిరిగరాక పోవటం నిశ్చయమేఅని; మీకు తెలుసునుకదా?"

"అమ్మా! తెలియకేం? అందుకేగా యీబాధం తానూ?"

"సరి, ఇప్పుడు నాగతి యేమిటి?"

"తల్లీ! న న్నేమిచేయమన్నావు? నీమీద ప్రేమచేత నీభర్త కెంతడబ్బో పంపాను. నీసౌఖ్యమే ప్రధానంగా నే నెప్పుడూ గణించాను. ఎంతడబ్బుకన్నా వెనుదీయను. కోరు. నీ కేంకావాలి? నా చేతిలో వున్నపని తప్పకుండా చేస్తాను."

"నేను పునర్వివాహం చేసుకొంటాను."

"పునర్వివాహమా?" అని నోరుతెరిచాడు భయాశ్చర్యరూపంగా.

"ఔను."

"ఎట్లూ? భర్త వుండగానే?"

"ఆహా, వుండగానే. తిరిగిరాని భర్త వుంటేనేం, లేకపోతేనేం?"

"అది శాస్త్రసమ్మతం కాదే! ఆపైని చట్టం కూడా ఒప్పుకోదు."

"ఏచట్టంలోనూ, ఏమతంలోనూకూడ లేదా?"

"అది నాకు తెలీదు. ఉన్నా వివాహమాడే దెవరు?"

"అహాఁ! ఎవరన్నా వుంటే."

"నేను చెప్పలేను—లేదు."

"ఆహాఁ! సరే."

ఏచట్టం ప్రకారమన్నా, ఏమత ప్రకారమన్నా వీలుంటుందేమో!

నేను వెనకతిరిగి వచ్చేశా నీవలికి. అతడు నిశ్చల పోయాడు. పాపం! ఆవృద్ధశిరస్సులో యెన్ని భావాలు నిండివున్నయో! ఎంతవేదన అణిగివుందో!

రాత్రి పస్నెండుగంటలు, వీథితలుపువద్ద జాగ్రత్తగావుంటారని నేను మొదటనే అనుకొన్నాను. రెండు చీరెలూ, నానగలపెట్టీ,— విశ్వనాథంవద్దంటోవున్నా అప్పటికి నాదగ్గరవున్న రూ. ౧౨౦౦ల నోట్లు పట్టుకొని దొడ్డిలో, నియమితమైన స్థలానికి వెళ్లాను. అక్కడ విశ్వనాథం వున్నాడు. గోడగెంతి ఆవలికి దిగాం. కొన్నిగజాల కక్కడ ఓజట్కాబండీ వుంది. మేంస్టేషనుకు చేరినవెంటనే కలకత్తాపోయే బండి వచ్చింది. కలకత్తాకు టిక్కట్లు తీసుకొని, సెకండుక్లాసులో కూచున్నాం. బండి బయలుదేరింది. సుమారు అయిదుగంటల వరకు నాకు నిద్దరారాలేదు. అంతకు కొంచెంముందుగానే విశ్వనాథంకూడా నిద్రపోయాడు.

ఎవరో తట్టిలేపగా నాకు మెలకువ వచ్చింది. రమారమి వుదయం పదిగంటలు కావచ్చింది. ఇంకా విశ్వనాథం నిద్రపోతోనే వున్నాడు. ఎదురుగా చూచాను, శరీరం నిలువునా నీరైంది. మా పెదనాన్న! అతడు బరంపురంలో స్కూలుమాస్టరు. రెండు ప్రక్కలా చూచేసరికి బరంపురంస్టేషనులో బండి ఆగివుంది.

"ఎక్కడకమ్మా ప్రయాణం?"

నాకు నోట మాటరాలేదు.

"బండిదిగు. సామా నెక్కడ?"

"కాదు — పనిమీద కలకత్తా వెళుతో వున్నాను" అన్నాను కొంచెంధైర్యం తెచ్చుకొని.

"ఏమి టాసని? ఈయ సెవడు?" అని విశ్వనాథాన్ని చూపించాడు. ఇంతలో విశ్వనాథంకూడా లేచి సంగతి యావత్తూ గాభరాగా చూడటం మొదలెట్టాడు. నేను బాగా ధైర్యం తెచ్చుకొన్నాను.

"వివాహంనిమిత్తం వెడుతున్నాను కలకత్తా. ఈయననే పెండ్లాడేది."

"తప్పు తప్పు. అట్టిమాట లాడకు. వెంటనే దిగిరా. ఆలస్యం లేదు."

"నేను రాను." అన్నాను మొండిగా.

"అట్లా అయితే యిదిచూడు." అని ఒక టెలిగ్రాం చూపించాడు. అది మానాన్న వద్దనుండి. చదివాను.

"లలిత పారి పోవుచున్నది—సుమారు రూ. ౧౦౦౦/- నగలు వెంటదీసుకొన్నది—కారకు డెవరో తెలియదు—ఆ ట్రేవను వచ్చినయెడల పట్టుకొనవలయును" అని వుంది.

ఆలోచించాను.

"నాకు మీడబ్బక్కర్లేదు. తీసుకోవచ్చు." అన్నాను.

"పనికిరాదు. ఇక టైము లేదు; తిన్నగా వస్తావా, దొంగతనంక్రింద పోలీసు కప్పగించమన్నావా మీయిద్దరినీ? ఏవిధంగానన్నా నీవుద్దేశం కొనసాగదు. నామాటవిని రా చల్లగా......అదిగో టైమైపోతుంది. చప్పున" అని గద్దించాడు.

నా కేమీ తోచలేదు. దైవాన్ని తిట్టాను. ఏడుస్తో, విశ్వనాథంకేసి చూస్తో బండిదిగాను. నగల పెట్టె మా పెదనాన్న పట్టుకొన్నాడు. విశ్వనాథం సీటు కానుకొని నిశ్చేష్టు డైపోయాడు. బండి కదిలింది. మాచూపులు దూరమైపోయినయి.

౭

ఇక ఆట్టే మిమ్మిబ్బంది పెట్టను. సాధ్యమైనంత త్వరలో సాంతం కానిచ్చేస్తాను. నాకు బలవంతంగా కేశఖండన చేయించి నన్నీపల్లెలో పడేశారు. నానగలన్నీ నట్టడవిలో కలిసిపోయాయి. నాసన్నచీరలు చల్లారిపోయాయి. నాచదువు చట్టుబండలయింది. నా సౌందర్యం చచ్చిపోయింది. ఇప్పుడు నేను లలితకుమారి యొక్క శల్యపంజరాన్ని. నేనూ, నా సైనుగుడ్డ— దాన్ని చూచి నేను, నన్ను చూచిఅదీ, యేడుస్తోవుంటాం. ఇప్పటికీ నాకు హామేషాకావు. ఒకొక్కొక్కప్పుడు చస్తేబాగేమో అనిపిస్తుంది. దానికీ అడ్డంకు లేర్పరిచారు. పోనీ, యీ నావిషాదమంతా ప్రపంచానికి వెళ్లబోసుకొని మరోసారి పెద్దపెట్టున రోదనంచేదామని, దీన్నతిదొంగతనంగా వ్రాసి పంపాను, అట్లాగన్నా నాఆత్మకి శాంతి కాస్త కలుగుతుందేమోనని. నాచరిత్ర సమంగాయెరిగినవాళ్లు యేడ్చినది నే నెరుగుదును. విశ్వనాథం యిప్పు డెక్కడ వున్నాడో యెవరికీ తెలీదట.

"నవనవలాడే అడవిగులాబీ నలిగిపోయింది. శరచ్చంద్రిక శిథిలమైపోయింది. ఆమెతో ఆపట్నానికే కాకుండా—ఆచుట్టుప్రక్కలకంతటికీ సౌందర్యలక్ష్మి స్వస్తిచెప్పేసింది" అని ప్రజలంటోవుంటారని వింటాను.

అన్నట్టు మరచాను. ఇప్పటికన్నా వచ్చిందేమో నని అనుకొంటారేమో—ఏడెనిమిదేళ్లయిందా—మరి వర్తమానం లేదు సుమండీ నాభర్తనుండి!